క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో డీఆర్‌డీఓ శ్రీనివాస్ తదితరులు

కొడంగల్: మండల పరిధి అప్పాయిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను డీఆర్‌డీఓ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. పని ప్రదేశంలో కల్పించిన మౌలిక సదుపాయాల గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఎండలు పెరగడంతో కూలీలు.. ఉదయం పూట.. పనులు పూర్తి చేసుకుని, ఇంటికి వెళ్లాలని సూచించారు. ఎంపీడీఓ ఉష శ్రీ, ఏపీఓ రాములు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

సీఐ పవన్‌కుమార్‌రెడ్డి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ

మొయినాబాద్‌రూరల్: వేసవిలో చలివేంద్రాలు బాటసారుల దాహార్తిని తీర్చేందుకు దోహదపడతాయని మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్ రెడ్డి అన్నారు. మండల పరిధి హిమాయత్ నగర్ చౌరస్తాలో విజయ్‌ఠాగూర్ గార్డెన్ ప్రొపరేటర్ సతీష్‌కుమార్ తన ఫంక్షన్ హాల్ ఎదుట చల్లని నీటితో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా సీఐ పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దప్పిక తీర్చడం అభినందనీయమన్నారు. ఎండలు విపరీతంగా పెరుగుతున్నాయని, మండే మంటలకు చల్లటి తాగునీరు ప్రజల దప్పిక తీరుస్తాయన్నారు. చిలుకూరు బాలాజీకి వెళ్లే రహదారికి దగ్గరగా ఉండడంతో భక్తులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో విజయ్‌ఠాగూర్ మేనేజర్ రాకేశ్, యువకులు తదితరుల పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ

కొత్తూరు: క్రీడల్లో రాణిస్తే విద్యార్థులు, యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గూడూరు గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన గూడూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయకుండా.. తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించాలని సూచించారు. ఆటల్లో రాణిస్తే భవిష్యత్తులో పోలీసు, ఆర్మీతో పాటు పలు రంగాల్లో సులువుగా ఉద్యోగాలు సాధించే అవకాశం ఉందని తెలిపారు. క్రీడలు ఆయా ప్రాంతాలకు చెందిన యువకుల మధ్య స్నేహభావం పెంపొందిస్తాయన్నారు. క్రీడాకారులు ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం తన సొంత ఖర్చులతో క్రీడాకారులకు టీ షర్టులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పద్మారావు, సత్తయ్య, రాజు, దయానంద్‌గుప్తా, రవినాయక్, మోడి దర్శన్, మల్లేశ్, నర్సింహ్మ, సిద్దు, సదానంద్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు తల్లోజు రామకృష్ణ రాజీనామా



ఆమనగల్లు: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తల్లోజు రామకృష్ణ ఆ పార్టీకి రాజీనామా చేశారు. శుక్రవారం తన రాజీనామా లేఖను మాజీ సీఎం కేసీఆర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేశానని.. రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశానని తెలిపారు. అయితే రాష్ట్ర ఏర్పాటు అనంతరం అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు వేరే పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఏనాడూ ఉద్యమకారులను పట్టించు కోలేదని, కేవలం డబ్బున్నవారికి, రియల్ ఎస్టేట్ వ్యాపారులకే ప్రాధాన్యం కల్పించారని ఆయన ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వైఖరికి నిరసనగా పార్టీని వీడుతున్నట్లు రామకృష్ణ ప్రకటించారు.

బీజేపీది మత రాజకీయం

పరిగి: దేశంలో ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్ పార్టీ గాలి వీస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పరశురాం రెడ్డి, వైస్‌ఎంపీపీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిధి మాదారం, రంగంపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. ప్రజలకు చేసిందేమీ లేదని, మతం పేరుతో రాజకీయం చేస్తున్న ఆ పార్టీ పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని వెల్లడించారు. పేదలకు న్యాయం జరగాలంటే హస్తం అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తుందని తెలిపారు. కేంద్రంలోనూ అధికారంలో ఉంటే మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి, పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇందులో పార్టీ నాయకులు ఆనందం, తౌరియనాయక్, రాంచందర్, రాజేందర్‌రెడ్డి, కృష్ణయ్య ఉన్నారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ ధీమా వ్యక్తంచేశారు. మండల పరిధి కోల్కుంద, సయ్యద్‌అల్లిపూర్ గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలంటే.. చేతి గుర్తుకు ఓటువేసి, రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇందులో పార్టీ సీనియర్ నాయకుడు సురేందర్, మాజీ ఎంపీపీ మల్లయ్య, నాయకులు అమరేందర్‌రెడ్డి, సుభాష్, వేమారెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సుభిక్ష పాలన

యాలాల: కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో సంక్షేమ పాలన సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా అన్నారు. మండల కేంద్రంలో ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందని, ఎన్నికల కోడ్ అనంతరం రుణమాఫీ, రూ.500 వంట గ్యాస్, 200 యూనిట్ల ఉచిత కరెంటు అమల్లోకి వస్తాయన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి, రంజిత్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఇందులో పార్టీ గ్రామ అధ్యక్షుడు నాగయ్య, ఉపాధ్యక్షుడు మోయిజ్, శ్రీనివాస్, యువజన అధ్యక్షుడు అశోక్ నాయీ, నాయకులు మారుతీ, సులేమాన్, రాములు, మైనొద్దీన్, మన్సూర్, లాలు, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.



ధారూరు: తిమ్మానగర్‌లో.. ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజలకు చేసిందేమీ లేదు

ధారూరు: దశాబ్ద కాలంలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధి గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. మందిరం పేరిట ఓట్లు అడుగుతున్న బీజేపీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని, చేసిన కుంభకోణాలు దాచిపెట్టి, ఓట్ల నాటకమాడుతున్న బీఆర్‌ఎస్‌కు ఓటు అనే ఆయుధంతో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని బలపర్చి, చేతి గుర్తుకు ఓటు వేసి, రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇందులో పార్టీ శ్రేణులు బుజ్జగౌడ్, మహ్మద్ బాబాకాన్, కిరణ్‌కుమార్, అశోక్, కిరణ్‌కుమార్‌రెడ్డి, సుకుమార్, రమేశ్‌కృష్ణ ఉన్నారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆ పార్టీ శ్రేణులు అన్నారు. మండల పరిధి పెద్దేముల్, మంబాపూర్, దుగ్గాపూర్, కందనెల్లి, తట్టెపల్లి, గాజీపూర్ గ్రామాల్లో వారు ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఓటు వేసి గెలపించాలని కోరారు. ఇందులో జితేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మధులత, నర్సింలు, గోపాలకృష్ణ, ఆనందచారి ఉన్నారు.

మరోసారి..

అనంతగిరి: చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి సీతారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. వికారాబాద్‌లో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. ఐదేళ్ల కాలంలో ఎంపీగా రంజిత్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, మరోసారి అవకాశం ఇచ్చి, అభివృద్ధిని ఆస్వాదించాలని కోరారు. ఇందులో స్పీకర్ కుమార్తె అనన్యచేతన్, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు గాయత్రి లక్ష్మణ్, స్వాతి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, మల్లికార్జున్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కులమతాల మధ్య చిచ్చుపెడుతున్న కమలం

- మతోన్మాద పార్టీని ఓడించండి
- కాంగ్రెస్‌ను గెలిపించండి
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు

మతరాజ్యం తెచ్చే కుట్ర

పరిగి: మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీ.. కులమతాల మధ్య చిచ్చు పెడుతు పబ్బం గడుపుతోందని ఆరోపించారు. మతాన్ని, రామున్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్న బీజేపీని ఇంటికి పంపించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. మరోసారి అధికారంలోకి వస్తే.. రాజ్యాంగాన్ని రద్దు చేసి, మతరాజ్యాన్ని తీసుకురావడానికి యత్నిస్తుందని విమర్శించారు. దేశం చాలా ప్రమాదంలో ఉందని, మోదీని గద్దె దించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలు ఆలోచించి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. సీపీఎం పార్టీ.. కాంగ్రెస్ ఇండియా కూటమికి పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఇందులో సత్తయ్య, రఘురాం, శేఖర్, ప్రశాంత్, మొగులయ్య ఉన్నారు.

నేడు ఎస్టీసెల్ సమీక్ష

కుల్కచర్ల: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని పీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఎస్టీసెల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ సత్య తెలిపారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. మధ్యాహ్నం జరగనున్న సమీక్షకు గిరిజనులు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, నాయకులు నర్సింహ నాయక్, శివరాములు, విఠల్ నాయక్, రవి, సాల్వీడు విఠల్, రాహుల్ నాయక్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

కొడంగల్: పట్టణ పరిధిలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించనున్న కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏడీఈ నవీన్‌కుమార్ తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: మండల కేంద్రానికి చెందిన మొండి జంగిలయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి.. ఎంపీటీసీ ఆనందం, తదితర నేతల ఆధ్వర్యంలో శుక్రవారం బాధిత కుటుంబానికి రూ.5వేలు సాయం అందజేశారు. ఇందులో నాయకులు జోగు వెంకటయ్య, తమ్మలి రాంచంద్రయ్య, భీమయ్య స్థానిక నాయకులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే ప్రజా సంక్షేమం

- మాయమాటలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్
- హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం
- కారుకు ఓటేద్దాం.. కాసానిని గెలిపిద్దాం
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు



పరిగిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్,కౌన్సిలర్లు

పరిగి: తెలంగాణ ప్రజలకు న్యాయం జరిగిందంటే అది బీఆర్‌ఎస్ హయాంలోనే అని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం పట్టణ కేంద్రం 7వ వార్డులో ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం ముకుంద మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పేదలకు చేసిందేమీ లేదన్నారు. పార్లమెంటులో తెలంగాణ సమస్యలపై పోరాటం చేయాలంటే అది బీఆర్‌ఎస్‌కే సాధ్యమని, ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి, పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. ఇందులో కౌన్సిలర్లు నాగేశ్వర్, వెంకటేశ్, రవిందర్, కృష్ణ, తాహెర్‌అలీ ఉన్నారు.

కేసీఆర్‌కు కృతజ్ఞతలు

యాలాల: బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలని బండారి ఇంజినీరింగ్ కళాశాల యజమాని శ్రీనివాస్ అన్నారు. హాజీపూర్ మాజీ సర్పంచ్ ఒంగో నిబాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేవెళ్ల స్థానాన్ని బీసీలకు కేటాయించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసానిని గెలిపించి, కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, సొసైటీ వైస్ చైర్మన్ రాములు, మాజీ వైస్ ఎంపీపీ, సర్పంచ్‌లు అనంతయ్య ముదిరాజ్, సాయిలు, మాజీ డైరెక్టర్లు మంత్రి వెంకటయ్య, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణకుమార్ తదితరులు ఉన్నారు.

గిరిజనుల ఓట్లన్నీ కారుకే..

బొంరాస్‌పేట: గిరిజనుల ఓట్లన్నీ బీఆర్‌ఎస్ పార్టీ కారు గుర్తుకే వేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నెహ్రూనాయక్ కోరారు. బొంరాస్‌పేట, దుద్యాల గిరిజన తండాల్లో వారు ఇంటింటి ప్రచారం చేశారు. ఇందులో పార్టీ నాయకులు బాలూనాయక్, శంకర్, ఫూల్‌సింగ్, చందర్‌నాయక్, శ్రీను, మోహన్ ఉన్నారు.

కాసానితో బీసీలకు మేలు

కుల్కచర్ల: బీసీనేత ఎంపీగా అయ్యే అవకాశం వచ్చిందని, ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకుడు మాలె కృష్ణయ్య గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయిందని ఆరోపించారు. రుణమాఫీ చేస్తామని చెప్పి, చేయలేదని, మరోసారి ఆ పార్టీ నేతల మోసపూరిత మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసానిని గెలిపిస్తే.. బీసీలకు మేలు జరుగుతుందని వెల్లడించారు. ఇందులో శ్రీశైలం, బాలు, బిచ్చయ్య, వెంకట్రాములు, సత్యయ్య, వెంకటయ్య, రషీద్ ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీ తోడుదొంగలు

నవాబుపేట: 'కాంగ్రెస్, బీజేపీలు తోడు దొంగలు. ఆ పార్టీలతో పేదలు, రైతులకు ఒరిగేదేమీ ఉండదు' అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఎద్దేవా చేశారు. మండల పరిధి గంగ్యాడ, గుబ్బడిపత్తేపూర్ గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పదేళ్లుగా కేంద్రంలో బీజేపీ, అంతకు ముందున్న కాంగ్రెస్ పార్టీలు.. ప్రజలకు చేసిందేమీ లేదని, ఇప్పుడు అధికారంలోకి రావడానికి తాపత్రయ పడుతున్నాయని విమర్శించారు. పదేళ్లు తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్.. రైతుబంధు, రైతుబీమా, రైతులకు 24 గంటల విద్యుత్‌తో పాటు అనేక సంక్షేమ ఫలాలు అర్హులకు అందజేసిందని తెలిపారు. ఇప్పుడవేం లేవని, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటు వేసి గెలింపిచాలని కోరారు. ఇందులో పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రశాంత్, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు దయాకర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, జూడ్సురెడ్డి, దాస్‌గౌడ్ ఉన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం

ప్రపంచ దృష్టిని ఆకర్శించిన దేశం

- ఇంటింటి ప్రచారంలో బీజేపీ శ్రేణులు



అనంతగిరి: ప్రచారంలో మాట్లాడుతున్న రాజస్థాన్ ఎమ్మెల్యే

యాలాల: ప్రధాని మోదీతోనే దేశం అభివృద్ధి చెందిందని ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మండల పరిధి దేవనూరు, దుబ్బతండా, దేవులాతండాల్లో పార్టీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ భద్రత, రక్షణ విషయంలో మోదీని మించిన నాయకుడు లేడన్నారు. పదేళ్ల కాలంలో దేశం అభివృద్ధిలో పరుగులు తీస్తూ.. ప్రపంచ దృష్టిని ఆకర్శించిందని పేర్కొన్నారు. కేంద్రం సహాయంతోనే తెలంగాణలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. మరోసారి మోదీ రావాలంటే.. కమలం గుర్తుకు ఓటు వేసి, పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇందులో దేవనూరు మాజీ సర్పంచ్ శివకుమార్, నాయకులు ఉన్నారు.

మల్కాపూర్‌లో..

తాండూరు రూరల్: ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శేఖాపూరం ఆంజనేయులు కోరారు. మండల పరిధి మల్కాపూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశం సురక్షితంగా ఉండాలంటే, మోదీ మరోసారి ప్రధాని కావాలన్నారు. కమలం గుర్తుకు ఓటు వేసి, కొండాను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇందులో నాయకులు చిరంజీవి, నరేందర్, సాయిగౌడ్, బాలాజీ, సాయి కుమార్, బోయిని రాజు, తరణ్, చింటులు ఉన్నారు.

మరోసారి అధికారం మాదే

అనంతగిరి: చేవెళ్ల పార్లమెంట్‌కో జరూర్ జీతేంగే అని రాజస్థాన్ రాష్ట్ర అహోరే నియోజకవర్గ ఎమ్మెల్యే ఛాగసింగ్ రాజ్ పురోహిత్ ధీమా వ్యక్తంచేశారు. వికారాబాద్ పట్టణంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. మోదీ పాలనలో దేశంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధిలో దూసుకుపోతుందని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో 400 పైగా స్థానాలు గెలుచుకుంటామని, మూడోసారి అధికారం చేపట్టేది బీజేపీనేని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, కొండా తనయుడు విశ్వజిత్, రాష్ట్ర నాయకుడు కేపీ రాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, జిల్లా కోశాధికారి రాజేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, సీనియర్ నాయకులు అమరేందర్‌రెడ్డి, బుస్స శ్రీకాంత్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు అనిల్‌కుమార్ ఉన్నారు.

రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ పలు పూజలు చేశారు. శివుడికి పూలతో అభిషేకం, పంచామృతాభిషేకంతో పాటు పలు పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు శుక్రవారం కావడంతో ఉదయం శివగంగ రాజరాజేశ్వర ఆలయానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి కుంకుమార్చన, దీపాలు వెలిగించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చా రు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అల్లె కుమార్, డైరెక్టర్లు, ఆలయ ప్రధాన పూజారులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన రాజరాజేశ్వరిదేవి

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మహేశ్వరం: చెరువులో అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని నీటి పారుదల శాఖ అధికారులు శుక్రవారం కూల్చివేయించారు. వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయం దిగువన తాళ్లకుంటలో కొందరు వ్యక్తులు కుంట భూమిలో గుట్టు చప్పుడు కాకుండా నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న నీటి పారుదల శాఖ ఏఈఈ గంగరాజు, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నడుమ నిర్మాణాన్ని కూల్చివేయించారు. చెరువులు, శిఖం భూముల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

ఇబ్రహీంపట్నం: వినోభానగర్‌లోని సాధన కుటీర్‌లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో క్రీడాకారులకు శుక్రవారం స్పోర్ట్స్ డ్రెస్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వ బడుల్లో విద్యనభ్యసిస్తూ కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న 150 మంది విద్యార్థులకు జీఎస్‌ఎఫ్ ప్రత్యేక శిక్షణను ఇస్తుంది. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక డ్రెస్‌లను, షూస్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఏసీపీ కేపీవీ రాజు, సుర సాని ట్రస్టుకు చెందిన రవీందర్‌రెడ్డి, వీఎంఎఫ్‌కు చెందిన బుచ్చయ్య, జ్ఞాన సరస్వతీ ఫౌండే షన్ వ్యవస్థాపకుడు సదా వెంకట్ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు సన్మానం

ఇబ్రహీంపట్నం: పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన ఎలిమినేడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో 20 మంది విద్యార్థులకు గాను 19 మంది పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి మండలంలో రెండోస్థానంలో నిలిచారని ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ తెలిపారు. అక్షిత 9.5 జీపీఏ, దీప్తి 9.3 జీపీఏ, అఖిల 9.2 జీపీఏ సాధించి పాఠశాలలో టాపర్లుగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణశ్రీ, వెంకటయ్య, గ్రామస్తులు.. గణేశ్, భిక్షపతి, మహేందర్, ఐలయ్య, రమేష్, శ్రీశైలం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహానికి సేవా ధార్మిక్ అవార్డు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహాన్ని.. లతా రాజా ఫౌండేషన్ వారు సేవా ధార్మిక్ అవార్డుకు ఎంపిక చేశారు. అనాథ, నిరుపేద విద్యార్థులకు భోజనం, వసతి సౌకర్యం కల్పించి వారికి పాఠశాల నుంచి ఉన్నత చదువుల వరకూ చెప్పించి డాక్టర్లు, ఇంజినీర్లు, పోలీసు అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులుగా సమాజంలో ఉన్నత స్థానాలు పొందేందుకు సహకరిస్తున్నందుకు అనాథ విద్యార్థి గృహాన్ని సేవా ధార్మిక్ అవార్డుకు ఎంపిక చేశామని లతా రాజా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కేకే రాజా శుక్రవారం ప్రకటించారు. జూన్ 9న సంగారెడ్డి ఎల్ఎన్ కన్వెన్షన్‌లో జరిగే కార్యక్రమంలో అనాథ గృహం అధ్యక్షుడు మార్గం రాజేశ్‌కు సేవా ధార్మిక్ అవార్డు, రూ.లక్ష నగదు, జ్ఞాపికను అందజేస్తామని వెల్లడించారు.

వీధి కుక్కలు కరిచేస్తున్నాయ్

- పెరుగుతున్న బాధితుల సంఖ్య
- ఆందోళనలో బాలాపూర్‌వాసులు
- నాలుగు నెలల్లో 500లకు పైగా కేసుల నమోదు
- కుటుంబ నియంత్రణ చేసినా ఫలితం లేదు



మీర్‌పేట: వీధి కుక్కల పెరగడంతో పాటు, వాటి బారిన పడిన ఆస్పత్రుల పాలవుతున్న బాధితుల అంతకంతకూ పెరుగుతూ ఆందోళన కలిగిస్తోంది. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శునకాలు వీచక్షణా రహితంగా దాడులకు తెగబడుతున్నాయి. చిన్నారులు, వృద్ధులపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. మీర్‌పేట కార్పొరేషన్‌తో పాటు బడంగ్‌పేట, జల్‌పల్లి ప్రాంతాల్లోనూ గ్రామ సింహాలు రెచ్చిపోతున్నాయి. దీంతో రోజుకు కనీసం 10 మంది వరకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ కోసం ఆస్పత్రికి క్యూ కడుతున్నట్లు బాలాపూర్ పట్టణ ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

పెరిగిన బాధితులు..

బాలాపూర్ మండల పరిధిలో నాలుగు నెలల్లో 521 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. జనవరిలో అత్యధికంగా 188, ఫిబ్రవరిలో 103, మార్చిలో 109, ఏప్రిల్‌లో 121 మంది కుక్కకాటు గురయ్యారు. ఈ సంఖ్య వైద్యసిబ్బందికి, అధికారులకు ఆందోళన కలిగిస్తోంది. రోజురోజుకు బాధితులు పెరిగిపోతుందని, ఆసుపత్రికి వచ్చే వారికి నాలుగు దశల్లో యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌తో పాటు టీటీ కూడా ఇస్తున్నామని వైద్య సిబ్బంది వెల్లడిస్తున్నారు. అధిక రక్తస్రావం అయిన వారిని నారాయణగూడ ఫీవర్ ఆస్పత్రికి తరలిస్తున్నామని వైద్యులు చెబుతున్నారు.

ఫలించని ఆపరేషన్లు..

మీర్‌పేట ప్రాంతంలో వీధికుక్కల సంఖ్యను నియంత్రించేందుకు గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. ఇందుకోసం మీర్‌పేట పెద్దచెరువు శ్మశాన వాటిక వద్ద ప్రత్యేకంగా కుక్కల కోసం ఇనుప కంచె బోన్‌లు ఏర్పాటు చేసి అక్కడే, కుని నిర్వహించేవారు. ఈ ప్రక్రియ మూడు నెలల పాటు జరిగింది. అయినా అంతగా ఫలితం లేకుండా పోయిందని, ఆపరేషన్ల పేరిట ఇతర ప్రాంతాల నుంచి కూడా కుక్కలను తీసుకొచ్చి, తరువాత అక్కడే వదిలేసేవారని పలువురు చెబుతున్నారు. ఆపరేన్లు చేయడంతో ఫలితం లేకపోగా, వాటి సంఖ్య విపరీతంగా పెరగడంతో ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు, బాధితులు వాపోతున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో పిల్లలు సాయంత్రం వేళల్లో బయట ఆడుకుంటారని, గుంపులుగా కుక్కలు తిరుగుతూ.. దాడికి పాల్పడే అవకాశం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



త్రివేణినగర్ వీధిలో గాయపడిన చిన్నారి



కుక్కల దాడిలో గాయపడిన వృద్ధుడు